ఆలయాల్లో అమావాస్య పూజలు


పెద్దగూడెం శివారులోని ఆంజనేయస్వామికి ఆలయంలో సంకీర్తనలు ఆలపిస్తున్న భక్తులు

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలోని వీరన్నగుట్టపై వెలిసిన శ్రీ భద్రకాళి సమేత వీరభద్రస్వామి ఆలయం వద్ద అమావాస్యను పురస్కరించుకొని భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త కమ్మరి గోపి ఆధ్వర్యంలో ముసాపేట మండలానికి చెందిన ముచ్చర్ల లక్ష్మీనరసింహులు కుటుంబ సభ్యులతో కలిసి ఉదయం గుట్టపై ఉన్న ఆలయంలో స్వామి వారికి అభిషేకం నిర్వహించారు. అనంతరం గుట్ట కింది భాగాన అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ప్రతి నెల అమావాస్య రోజున ఆలయం వద్ద స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించడంతో పాటుగా దాతల సహకారంతో అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నామని గోపి చెప్పారు. పూజల్లో జెడ్పీటీసీ సామ్యనాయక్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

పెబ్బేరు రూరల్: అమావాస్య సందర్భంగా వనపర్తి మండలంలోని చిమనగుంటపల్లి శివారులోని లక్ష్మీ నరసింహాస్వామి, సీతారామ ఆలయంలో ఆదివారం రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి, ఏఐసీసీ కోఆర్డినేటర్ జిల్లెల ఆదిత్యారెడ్డి పాల్గొని ప్రతేక పూజలు జరిపించారు. అలయ అర్చకులు వారికి పత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందించారు. అనంతరం ఏఐసీసీ కోఆర్డినేటర్ జిల్లెల ఆదిత్యారెడ్డి అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు అన్నప్రసాదాలు వడ్డించారు.

పెద్దగూడెం శివారులో..

అమావాస్యను పురస్కరించుకుని వనపర్తి మండలంలోని పెద్దగూడెం శివారులోని తిరుమలయ్య గుట్ట అడివి ఆంజనేయస్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు ఆలయంలో అభిషేకాలు జరిపించారు. జెడ్పీ చైర్మన్ ఆర్ లోక్‌నాథ్‌రెడ్డి పాల్గొని పూజలు నిర్వహించారు. అర్చకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. భక్తులు అన్నమయ్య సంకీర్తనలు ఆలపించారు. దాతల సహకారంతో ఆలయం వద్ద భక్తులకు అన్నదానం చేశారు. ఆలయం వద్ద అమావాస్యకు పూజలు జరిపించడం మొదటిసారి అయినా ఇంత స్పందన ఉంటుందని ఊహించలేదని పెద్దగూడెం మాజీ సర్పంచ్ కొండన్న తెలిపారు. పెబ్బేరు మండలంలోని పాతపల్లి చింతలకుంట ఆంజనేయ స్వామి వద్ద అమవాస్య సందర్భంగా ప్రత్యేకాభిషేకాలను నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు అన్నదానం చేపట్టారు.


చిమనగుంటపల్లిలో ఆలయంలో..


ఖిల్లాఘనపురం వీరభద్రస్వామి ఆలయం వద్ద..

జ్యోతిష్య శిరోమణి అవార్డుతో సత్కారం


జ్యోతిష్య శిరోమణి అవార్డుతో సత్కారం అందుకుంటున్న వేణుగోపాల్‌రావు

కొత్తకోట రూరల్: శ్రీపొట్టి శ్రీరాములు యూనివర్సిటీ ఎస్ఎస్ లైవ్ అస్ట్రో వారు హైదరాబాద్‌లో ఆదివారం నిర్వహించిన జ్యోతిష్య సెమినార్ సదస్సులో కొత్తకోట మండలం రాయిణిపేట గ్రామానికి చెందిన వేణుగోపాల్‌రావు అత్యుత్తమ ప్రతిభ కనబర్చి జ్యోతిష్య శిరోమణి అవార్డుకు ఎంపికయ్యారు. జ్యోతిష్య సంబంధమైన జాతక రీత్యా వివాహ, సంతాన, ఉద్యోగం, విదేశీ వ్యాపారం తదితర అంశాలపై సెమినార్‌లో పాల్గొని చర్చించారు. వివాహం, సంతాన యోగం, టైమింగ్ ఆఫ్ ఈవెంట్ కేపీ, కూసీఐఎల్ పద్ధతిలో వేణుగోపాల్ రావు రాసిన జ్యోతిష్య (ఇంగ్లిష్, తెలుగు) ఆర్టికల్స్ జాతీయస్థాయి పత్రిక ఎంఏ–జోన్‌లో ప్రచురితమయ్యాయి. ఇది వరకే బ్రహ్మణ సంక్షేమ వేదిక నుంచి కూడా గతంలో 'జ్యోతిష్య ప్రముఖ' అనే బిరుదుతో సత్కరించారు. ఈ అరుదైన సత్కారం వనపర్తి జిల్లా జ్యోతిష్కులకు రావటం గర్వించదగిన విషయమని స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు ఖాయం


మక్తల్‌కు తరలిన కాంగ్రెస్ నాయకులు

ఆత్మకూర్: కాంగ్రెస్ పార్టీ మాట ఇచ్చిందంటే తప్పదని, ఆరు గ్యారంటీ పథకాల్లో ఇప్పటికే నాలుగింటిని అమలు అవుతున్నాయని నాయకులు గంగాధర్‌గౌడ్, రహ్మతుల్లా, తులసీరాజ్, పరమేష్, నల్గొండ శ్రీను అన్నారు. ఆదివారం మక్తల్‌లో జరిగిన పార్లమెంట్ సన్నాహక సమావేశానికి ఆత్మకూర్ నుంచి కాంగ్రెస్ పార్టీ శ్రేణులు తరలివెళ్లారు. రూ.10లక్షలతో ఉచిత వైద్యం, రూ.500లకే వంట గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌తో ప్రజల్లో కాంగ్రెస్‌పై నమ్మకం ఏర్పడిందన్నారు. త్వరలోనే రూ.5లక్షలతో ఇందిరమ్మ ఇళ్లు, మహిళామణులకు రూ.2,500 అందించనున్నట్లు పేర్కొన్నారు. మహబూబ్‌నగర్ పార్లమెంటులో కాంగ్రెస్ అభ్యర్థి చల్ల వంశీచందర్‌రెడ్డి గెలుపు కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్టీడీ శ్రీను, దాము, సాయి రాఘవ, మహేష్, అశోక్, వెంకటనర్సింహారావు, ముక్తేశ్వర్, వినయ్‌రెడ్డి, అజ్మత్, గంగ, దస్తగిరి, గడ్డం శ్రీనివాస్, షంశీర్, చిరంజీవి, సూరి, మల్లేష్, అబ్దుల్లా, రఘు, మధు తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

గట్టుమల్లయ్యకు బోనాలు



గోపాల్‌పేట: రేవల్లి మండల కేంద్రంలో ఆదివారం గట్టు మల్లయ్యకు ప్రజలు బోనమత్తి మొక్కులు తీర్చుకున్నారు. ఇంటి వద్ద వండిన ప్రత్యేక వంటకాన్ని మహిళలు, యువతులు గంపల్లో పెట్టుకుని ఊరేగింపుగా బోలు, డప్పు వాయిద్యాల నడుమ శానాయిపల్లి గట్టుపై ఉన్న మల్లయ్య వద్దకు తీసుకువెళ్లి నైవేద్యం సమర్పించారు.

అందరూ భగవద్గీత చదవాలి



కొత్తకోట రూరల్: త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి ఆధ్వర్యంలో మహాశివరాత్రి పురస్కరించుకుని మండలంలోని భూత్కూర్, అమడబాకుల గ్రామాల్లో భగవద్గీత, అనుబంధ గ్రంథాలను ప్రచారం చేశారు. ఈ సందర్భంగా భగవద్గీత చదివి వినిపించడంతో పాటు ప్రాముఖ్యతను వివరించారు. శివలింగంపై ఉన్న మూడు విభూతి రేఖలు జీవాత్మ, ఆత్మ, పరమాత్మలకు గుర్తు అని, ఆత్మను ఆరాధిస్తే జీవుడు మోక్షం పొందుతాడని అందుకే మధ్యలో ఉండే విభూతి రేఖకు ఎర్రని బొట్టు పెడుతారని తెలిపారు. మూడు ఆత్మల వివరణ తెలుసోవడం ఆధ్యాత్మికంలో ముఖ్యమైన విషయమని వివరించారు. కార్యక్రమంలో విజయభాస్కర్‌రెడ్డి, మాసన్న, వేణుగోపాల్, శివ, బాలకృష్ణ, శైలజ, లయ, సిమ్మయ్య, జోగ్గి, ప్రమీల, శంకరమ్మ తదితరులు ఉన్నారు.

బీజేపీలోకి మాజీ కౌన్సిలర్



వనపర్తి టౌన్: పట్టణంలోని 2, 11వ వార్డు నుంచి గతంలో కౌన్సిలర్‌గా పోటీ చేసి గెలుపొంది, 2020లో జరిగిన ఎన్నికల్లో పరాజయం పాలైన మాజీ కౌన్సిలర్ అలివేలమ్మ భర్త కేశవాచారితో కలిసి ఆదివారం పట్టణ చేరికల కమిటీ కన్వీనర్ సబ్బిరెడ్డి వెంకటరెడ్డి ఆధ్వర్యంలో బీజేపీ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో నాగర్‌కర్నూల్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి పోతుగంటి భరత్‌ప్రసాద్‌ను గెలిపించేందుకు, అవేవిధంగా మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ గెలుపు కోసం కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో కుమారస్వామి, సీతారాములు, చిత్తారి ప్రభాకర్, గోర్ల బాబురావు తదితరులు పాల్గొన్నారు.

20 జతల భజన తాళాలు వితరణ



పాన్‌గల్: అయోధ్య నుంచి తీసుకొచ్చిన 20 జతల భజన తాళాలను గ్రామానికి చెందిన పోతుల మడుగు, గొల్లపల్లి భక్తుల బృందాలకు బీజేపీ నాయకులు ఆదివారం అందజేశారు. భక్త బృందాల అవసరాలను దృష్టిలో ఉంచుకొని వారికి అవసరమగు భజన తాళాలను అయోధ్య నుంచి తీసుకొచ్చి అందజేయడంపై గ్రామ భక్త బృందం సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల బీజేపీ నాయకులు ముంత వెంకటేష్‌యాదవ్, రాముడు, రాజు, రంగస్వామి, రవీందర్, నరసింహాస్వామి, భాను, శ్రీకాంత్, భక్త బృందం సభ్యులు పాల్గొన్నారు.

ముగిసిన ఈదమ్మ జాతర

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలో ప్రతి ఏడాది వారం రోజుల పాటు జరిగే ఈదమ్మ తల్లి జాతర ఆదివారంతో ముగిసిందని నిర్వాహకులు తెలిపారు. వారం రోజుల క్రితం ప్రారంభమైన ఈ జాతర సందర్భంగా మండలంలోని గ్రామాల భక్తులతో పాటుగా జిల్లా నలుమూలల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో చేరుకుని అమ్మవారికి ప్రత్యేకంగా తయారు చేసిన వంటకాలతో బోనం సమర్పించారు. కొందరు భక్తులు కోళ్ల, గొర్రె పొటేళ్ల అమ్మవారికి బలిచ్చి మొక్కులు తీర్చుకున్నారు. జాతరలో తినుబండారాలు, ఆటవస్తువులు, గాజుల దుకాణాలు ఏర్పాటు చేశారు. ఆదివారం వారాంతపు సంత కావడంతో భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చి అమ్మవారికి పూజలు చేశారు.



'ఆన్‌లైన్ మనీ యాప్‌ల జోలికి వెళ్లొద్దు'

పాన్‌గల్: మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో వేక్ ఆన్‌లైన్ మనీ ఎర్నింగ్ యాప్‌లో డబ్బులు జమ చేస్తే ఎక్కువ డబ్బులు వస్తాయనే ఆశతో యువత డబ్బులు డిపాజిట్ చేస్తూ మోసపోతున్నారు. ప్రతి నిత్యం చాలా మంది యువకులు ఆశతో ఒకరి ద్వారా మరొకరు యాప్‌లో జాయిన్ అవుతూ డబ్బులను డిపాజిట్ చేస్తున్నారు. మొదట్లో పెట్టుబడి పెట్టిన వారికి కమీషన్ వస్తుండటంతో అదే నమ్మకంతో ఎక్కువ లాభాల కోసం అధిక మొత్తంలో వస్తుందని నమ్మించారు. ఈ యాప్‌లో యువతతో పాటు ప్రభుత్వ ఉపాధ్యాయులు కూడా డిపాజిట్లు చేస్తుండటం గమనార్హం. ఇప్పటికి అనేక ఆన్‌లైన్, సైబర్ మోసాలు జరుగుతున్నా ఇంకా ఆన్‌లైన్ యాప్‌లను నమ్మి అందులో డిపాజిట్లు చేయడంపై కలిగిస్తుందని పోలీసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి డిపాజిట్లతో మోసాలు తప్పా ఎలాంటి ప్రయోజనాలు ఉండవని పోలీసులు యువతకు సూచిస్తున్నారు. ఇలాంటి ఆన్‌లైన్ డిపాజిట్లపై యువత మోసపోకుండా నిరంతరం పోలీసులు అవగహన కార్యక్రమాలు నిర్వహించాలని పలువురు కోరుతున్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ


అమరచింతలో బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, రావుల చంద్రశేఖర్‌రెడ్డి, ప్రకాష్‌రెడ్డి

వనపర్తి టౌన్: జిల్లా కేంద్రంలోని 6వ వార్డుకు చెందిన నందిమల్ల సవరమ్మ ఆదివారం మృతి చెందింది. విషయం తెలుసుకున్న ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ చిన్నారెడ్డి రూ. 5వేల ఆర్థికసాయాన్ని కాంగ్రెస్ నాయకుల ద్వారా పంపించారు. ఈ మేరకు ఆదివారం కాంగ్రెస్ మత్స్యకార సంఘం జిల్లా అధ్యక్షుడు నందిమల్ల యాదయ్య సవరమ్మ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, నగదును బాధిత కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో రాజు, మన్యం, నరసింహ తదితరులు ఉన్నారు.

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు మాజీ సర్పంచ్ కురుమూర్తి తండ్రి సవరన్న ఆదివారం మరణించాడు. జెడ్పీటీసీ కృష్ణయ్య మృతదేహానికి నివాళులర్పించి, బాధిత కుటుంబానికి సంతాపం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కోఆప్షన్ సభ్యుడు చాంద్ పాష, మండల అధ్యక్షుడు యాదగిరి, ఎస్సీ సెల్ అధ్యక్షుడు గన్నెపల్లి మనోజ్‌కుమార్, శివ, శంకర్ నాయుడు, కోట్ల తిరుపతయ్య, మూలమల్ల ప్రవీణ్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

లక్ష్మారెడ్డి మృతికి సంతాపం

అమరచింత: అమరచింత లిఫ్ట్ మాజీ అధ్యక్షురాలు సౌజన్యరెడ్డి భర్త కమిట లక్ష్మారెడ్డి మృతిపై మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. ఆదివారం పట్టణంలోని సౌజన్యరెడ్డి ఇంటికి వచ్చిన పలువురు నాయకులు లక్ష్మారెడ్డి భౌతికకాయంపై పుష్పగుచ్ఛాలు ఉంచి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. మాజీ మంత్రి రావుల చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ అడ్వకేట్ జనరల్ దేశాయి ప్రకాష్‌రెడ్డి, టీపీసీసీ గీత కార్మిక సంగం రాష్ట్ర చైర్మన్ కేశం నాగరాజ్ గౌడ్ తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

సావిత్రిబాయి పూలే స్ఫూర్తితో ఎదగాలి


శ్రీరంగాపురంలో..


అమరచింతలో..


వనపర్తిలో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కవులు, నాయకులు

వనపర్తి టౌన్: సమాజంలో మహిళలు సావిత్రిబాయి పూలే స్ఫూర్తితో ఎదగాలని, అప్పుడు సమాజం అభివృద్ధి వైపు నడుస్తుందని ప్రజావాగ్గేయకారుడు రాజారామ్‌ప్రకాశ్ అన్నారు. సావిత్రిబాయి పూలే వర్ధంతిని పురస్కరించుకొని టీజేఏసీ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాజారామ్‌ప్రకాశ్ మాట్లాడుతూ.. భారతదేశ తొలి మహిళా ఉపాధ్యాయురాలు, సంఘ సంస్కర్త సావిత్రిబాయి పూలే సేవలు మరువలేనివన్నారు. కార్యక్రమంలో డాక్టర్ పగిడాల శ్రీనివాసరెడ్డి, కవులు గిరిరాజాచారి, డాక్టర్ నాయకంటి నరసింహాశర్మ, గంధం గట్టయ్య, దేవన్న నాయుడు, బాలేమియా, పరమేశ్వరచారి, సత్యం చారి, మాధవాచారి, రవికుమార్, శివుడు, రాంబాబు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

పెబ్బేరు రూరల్: మండల బహుజన సమాజ్ పార్టీ కోశాధికారి రాముడు ఆధ్వర్యంలో ఆదివారం శ్రీరంగాపురం మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌక్‌లో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ధర్మ, శ్రీనివాసులు, బీసన్న, కురుమయ్య, శివ, సుమన్‌యాదవ్, ఎంపీటీసీ ఎల్లస్వామి, నాగేష్ పాల్గొన్నారు.

అమరచింత: సావిత్రి బాయి పూలే వర్ధంతిని పురస్కరించుకొని ఆదివారం టీజేఎస్ ఆధ్వర్యంలో ఆమె చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో అంబేడ్కర్ జాతర కమిటీ జిల్లా ప్రధాన కార్యదర్శి విజయ్, రామ్మూర్తి, రాము తదితరులు పాల్గొన్నారు.

నేడు చలో మహబూబ్‌నగర్

ఆత్మకూర్: పార్లమెంటు ఎన్నికల సందర్భంగా మహబూబ్‌నగర్‌లోని జేజేఆర్ గార్డెన్‌లో సోమవారం నిర్వహించే బీఆర్ఎస్ పార్లమెంట్ సమావేశానికి బీఆర్ఎస్ శ్రేణులు పెద్ద ఎత్తున తరలిరావాలని మండల అధ్యక్షుడు రవికుమార్‌యాదవ్ కోరారు. మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి నేతృత్వంలో మండలం నుంచి 50కిపైగా వాహనాల్లో బీఆర్ఎస్ శ్రేణులు తరలి వెళ్తున్నట్లు తెలిపారు. ఈసమావేశానికి మాజీ మంత్రులు కేటీఆర్, శ్రీనివాస్‌గౌడ్, నిరంజన్‌రెడ్డితో పాటు ఏడు నియోజకవర్గాల మాజీ ఎమ్మెల్యేలు హాజరవుతున్నారని పేర్కొన్నారు.

గోపాల్‌పేటలో బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం

గోపాల్‌పేట: మండల కేంద్రంలోని పద్మావతి గార్డెన్‌లో సోమవారం బీఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం ఉంటుందని, కార్యక్రమానికి మాజీ వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్ రెడ్డి హాజరవుతారని వైస్ ఎంపీపీ చంద్రశేఖర్ తెలిపారు. కార్యక్రమంలో లోక్‌సభ ఎన్నికలు, స్థానిక సంస్థల ఎన్నికలపై నిరంజన్‌రెడ్డి దిశానిర్దేశం చేస్తారన్నారు. ఉమ్మడి గోపాల్‌పేట మండలంలోని బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు సకాలంలో హాజరు కావాలని కోరారు.

వైద్య సిబ్బందికి సహకరించండి

పాన్‌గల్: కుష్ఠు వ్యాధిగ్రస్తుల గుర్తింపు కోసం ఇంటింటికీ వచ్చే వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలకు సహకరించి వివరాలు అందించాలని పీహెచ్‌సీ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రామయ్య ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. సోమవారం నుంచి ఇంటింటి సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని సిబ్బంది ఆదేశించారు. వ్యాధిని ప్రారంభ దశలో గుర్తించి ఎండీటీ చికిత్స ఇస్తే అంగకల్యానికి దారి తీయకుండా నివారించొచ్చని ఆయన పేర్కొన్నారు.

పేదలకు వైద్యం అందుబాటులో ఉండాలి


డాక్టర్ సాయికృష్ణగౌడ్‌ను అభినందిస్తున్న సాహితీ కళావేదిక సభ్యులు

కొత్తకోట రూరల్: పేదలకు వైద్యం చేరువ కావాలని సాహితీ కళావేదిక జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్‌గౌడ్ అన్నారు. 'సత్యసాయి హోమియో వైద్యశాల' మహబూబ్‌నగర్ వారి ఆధ్వర్యంలో పట్టణ కేంద్రంలోని సరస్వతీ శిశుమందిర్‌లో కొంత కాలంగా అందిస్తున్న ఉచిత వైద్య శిబిరాన్ని సాహితీ కళావేదిక సభ్యులు సందర్శించారు. ఈ సందర్భంగా ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్న డాక్టర్ సాయికృష్ణగౌడ్‌ను ఆయన శాలువాలతో సత్కరించారు. అనంతరం శంకర్‌గౌడ్ మాట్లాడుతూ సరైన వైద్యం అందక ఎంతో మంది పేదలు ఇబ్బందులు పడుతున్నారని, అలాంటి వారికి ఇలాంటి శిబిరం ఏర్పాటు చేయడంతో పాటు అవసరం ఉన్న వారికి ఉచితంగా మందులు ఇవ్వడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సాహితీ కళావేదిక ప్రతినిధులు సూర చంద్రశేఖర్, రాములుయాదవ్, వెంకట్రాములు, దేవన్న, చంద్రశేఖర్, శ్రీనివాసులుగౌడ్, శేఖర్‌గౌడ్, శ్యాంసుందర్, సత్యం తదితరులు ఉన్నారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం


పూర్వ విద్యార్థులతో నాటి ఉపాధ్యాయులు

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో చదివిన పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక ఆదివారం నిర్వహించారు. పాఠశాలలో 2003–04 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం పాఠశాల వద్దకు చేరుకున్నారు. నాడు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఆహ్వానించి వారిని శాలువాలు, పూల మాలలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నాటి తీపి జ్ఞాపకాలను నెమరు వేసుకుని సంతోషంగా గడిపారు. అందరూ కలిసి సహపంక్తి భోజనాలు చేశారు. మునుముందు ఓ సేవా సంఘం ఏర్పాటు చేసి పాఠశాల అభివృద్ధి కోసం కృషి చేస్తామని వారు చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులతో పాటుగా కృష్ణయ్య, నరేష్, నాగరాజు, నర్సింహ, ఫిరోజ్, అనిల్, రాజేందర్ తదితరులతో పాటుగా మొత్తం 67 మంది పాల్గొన్నారు.

నేటి నుంచి పరమేశ్వరస్వామి జాతర

- వారం రోజుల పాటు ప్రత్యేక పూజలు
- ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో భారీ ఏర్పాట్లు
- నేడు మొదటి తేరుమహోత్సవం


ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్ఐ నరేందర్

ఆత్మకూర్: పట్టణ శివారులోని చెరువులో వెలసిన స్వయంభు పరమేశ్వరస్వామి జాతర సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. 11, 12, 13 తేదీల్లో రాత్రి 9గంటలకు తేరు మహోత్సవం కనుల పండుగగా జరుగనుంది. ఆత్మకూర్ సంస్థానాదీశుల కాలం నుంచి పరమేశ్వరస్వామి జాతర గతంలో ఘనంగా నిర్వహించేవారు. ఆత్మకూర్‌లో అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో వారం రోజుల పాటు జాతరను ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. సోమ, మంగళ, బుధవారం రాత్రిల్లో మూడు రోజులపాటు ప్రత్యేక పూజలతో పాటు పల్లకీసేవ, రథోత్స వేడుకలు ఘనంగా నిర్వహించనున్నారు.

జాతర సందర్భంగా బందోబస్తు

చెరువు మధ్యలో ఉన్న పరమేశ్వరస్వామి ఆలయం వద్ద నీటి ఉధృతి ఉండడంతో ప్రమాదాలు జరుగకుండ చర్యలు చేపడుతున్నామని ఆత్మకూర్ ఎస్ఐ నరేందర్ అన్నారు. ఆదివారం సాయంత్రం పరమేశ్వరస్వామి ఆలయ పరిసరాలను పరిశీలించారు. ఆలయ పూజారి కర్పసయ్యకు, భక్తులకు పలు సూచనలు చేశారు. పోలీసుల ఆధ్వర్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా బందోబస్తును నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు నీటిలోకి వెళ్లకుండా ఆలయంలోకి ప్రవేశించి పూజలు నిర్వహించుకోవాలని సూచించారు.

నాయీబ్రాహ్మణులకు నామినేటెడ్ పోస్టులు ఇవ్వాలి


సూర్యరావుకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఖిల్లాఘనపురం: దేవాదాయ శాఖలో నాయీబ్రాహ్మణులకు నామినేటెడ్ పోస్టులు ఇవ్వాలని జిల్లా బీసీ నాయకులు ఆశన్న, జిల్లా నాయీబ్రాహ్మణ సంఘం ఉపాధ్యక్షుడు నర్సింహులు కోరారు. ఆదివారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని పద్మావతి కల్యాణ మండపంలో జరిగిన బీసీ సమాజ్ సమావేశానికి వారు హాజరై బీసీ సమాజ్ రాష్ట్ర అధ్యక్షుడు సూర్యరావుకు వినతిపత్రం ఇచ్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు దేవాదాయ శాఖలో నాయీబ్రాహ్మణులకు క్షౌ రవృత్తి, నాదస్వర వృత్తిలో పనిచేసేందుకు అవకాశం ఇచ్చారని, అదేవిధంగా నామినేటెడ్ పదవుల్లోనూ అవకాశం ఇవ్వాలని వినతి పత్రంలో కోరారు. కార్యక్రమంలో నాయీబ్రాహ్మణ సంఘం మండల అధ్యక్షుడు శేఖర్, జిల్లా కార్యవర్గ సభ్యులు శ్రీనివాసులు, గోవిందు తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన



పెబ్బేరు రూరల్: కమ్యూనిటీ పోలీస్‌లో భాగంగా శనివారం వనపర్తి పట్టణంలోని చిట్యాల రోడ్డులోని డబుల్‌బెడ్ రూం ఇళ్ల వద్ద కాలనీవాసులకు చట్టాలపై వనపర్తి పట్టణ ఎస్ఐ జయన్న అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ జయన్న మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రతల గురించి వివరించారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని, ఇళ్ల వద్ద అపరిచిత వ్యక్తులు కనబడితే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. అవాంఛనీయ ఘటనలు జరిగిన వెంటనే 100కు డయలు చేయాలని సూచించారు. హెల్మెంట్ లేకుండా వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని, మైనర్లకు వాహనాలను ఇవ్వరాదని హెచ్చరించారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

ఆత్మకూర్: మండలంలోని కత్తేపల్లి శివారులో పేకాట ఆడుతున్న శిబిరంపై దాడి చేసినట్లు సీఐ శివకుమార్, ఎస్ఐ నరేందర్ తెలిపారు. ఆదివారం సాయంత్రం కత్తేపల్లిలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో దాడులు నిర్వహించి ఎనిమిది మందిని అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ.5,220 నగదు, నాలుగు బైకులు, ఐదు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఘటన స్థలం నుంచి పారిపోయిన మరో ఇద్దరిపై కూడా కేసులు నమోదు చేశామని వెల్లడించారు. జూదం ఆడేవారిపై గట్టి నిఘాను ఏర్పాటు చేశామని, ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని, కేసులు నమోదు చేసి కోర్టుకు హాజరుపరుస్తామని హెచ్చరించారు.

ముగిసిన బ్యాడ్మింటన్ పోటీలు

వనపర్తి టౌన్: నారమ్మగారి నర్సిరెడ్డి, శంకరమ్మ స్మారకార్థం సిల్వర్ జూబ్లీ క్లబ్‌లో నిర్వహించిన ఉమ్మడి జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ పోటీలు ఆదివారం ముగిసినట్లు మున్సిపల్ వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్ తెలిపారు. ఈ మేరకు సింగిల్స్‌లో మహబూబ్‌నగర్ నుంచి విన్నర్‌గా జీషం నిలవడంతో రూ. 2,500, వనపర్తికి చెందిన ఈక్షిత్ రన్నర్‌గా నిలవడంతో రూ.1,500, డబుల్స్‌లో మహబూబ్‌నగర్‌కు చెందిన విన్నర్స్ జోయెల్, భానులకు రూ. 40 వేలు, రన్నర్స్ జావిద్, ఆసిఫ్‌కు రూ. 20వేల నగదు బహుమతి, ట్రోఫీలను అందజేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆవుల రమేష్, బాదం పాండు, చీర్ల భాస్కర్, రఘువర్ధన్‌రెడ్డి, వరప్రసాద్, మోహన్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, లక్ష్మీకాంత్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.